మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు


కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కౌన్సిలర్లు

మణికొండ: నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో నార్సింగి, కోకాపేట్ కౌన్సిలర్లు పి.ప్రవీణ్‌కుమార్, జి. శివారెడ్డి బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

మణికొండ: మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు మున్సిపల్ మేనేజర్ బీఎస్‌కే రమేశ్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, అకౌంట్స్ అధికారి వీరస్వామి, టీపీఓ సంతోష్‌సింగ్, ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

శంషాబాద్ ఏసీపీ..



శంషాబాద్: శంషాబాద్ ఏసీపీగా కె. శ్రీనివాస్ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఏసీపీ రాంచందర్‌రావు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఈయన ఇక్కడికి వచ్చారు.

నార్సింగి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్..

మణికొండ: నార్సింగి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా జి. వెంకటరమణ గౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నార్సింగి ఏసీపీ కేంద్రంగా ఏర్పడిన సమయంలో పోస్టింగ్ వచ్చి ఎన్నికలు రావడంతో బదిలీపై వెళ్లారు. తిరిగి రెండోసారి నార్సింగి ఏసీపీగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను బుధవారం నటి వర్షిణీ సౌందర్‌రాజన్ నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. నగరవాసులను ఆకట్టుకునే విధంగా పలు రకాల నూతన మోడల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమ్మర్ స్పెషల్ డ్రెస్‌మెటీరియల్స్, డ్రెస్సెస్‌లు ప్రత్యేకంగా ఉన్నాయన్నారు. వివాహాది శుభకార్యాలకు, పండుగలకు నూతన డిజైన్స్ ఆకర్షణగా నిలిస్తున్నాయన్నారు. డిజైనర్లు రూపొందించిన నగలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నటి శ్రవంతి చోకరపు, చాదిని బగ్వానిలతో పలువురు మోడల్స్, డిజైనర్లు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

రాయదుర్గం: చిన్నతనంలోనే చదువుతోపాటు పద్యాలు, కథలు రాయడంలో తన కుతానే సాటిగా హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థిని లైనాసింగ్ నిరూపించుకున్నారు. ఈ స్కూల్‌కు చెందిన లైనాసింగ్ 7వ తరగతి చదువుతోంది. ఆమె ఇటీవల ఒక కథ రాసింది. దాన్ని ప్రతిష్ఠాత్మకమైన 'ట్రిబుక్స్ డాట్‌కామ్' కథల పుస్తకంలో ప్రచురించడం విశేషం. ఈ నేపథ్యంలో బుధవారం స్కూల్‌లో ప్రిన్సిపల్ మురళి ఆధ్వర్యంలో లైనాసింగ్ రాసిన కథను ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. లైనాసింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి తమలోని నైపుణ్యాన్ని, సృజనాత్మకతక ఆలోచనలను ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు.

సీఎంకు గిరిజన ఉద్యోగుల కృతజ్ఞతలు

ఏజీవర్సిటీ: బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతికి బంజారా కమ్యూనిటీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సీఎంకు గిరిజన ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సైంటిస్ట్ మడోవత్ రమేశ్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తుందని పేర్కొన్నారు.

ఆర్ట్ గ్యాలరీ పనులను అడ్డుకున్న విద్యార్థులు

నాంపల్లి: జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అధికారులకు వర్సిటీ ప్రాంగణంలోని క్యాంటీన్ కామధేనువుగా మారిందని విద్యార్థులు ఆరోపించారు. క్యాంటీన్‌లో ఆర్ట్ గ్యాలరీని నిర్మించొద్దని నినాదాలు చేపట్టారు. క్యాంటీన్ నిర్వహణను గాలికి వదిలేసిన వర్సిటీ అధికారులు ప్రస్తుతం క్యాంటీన్ స్థానంలో ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే గడచిన రెండు రోజులుగా క్యాంటీన్ పైఅంతస్తులో మరమ్మతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీలోని క్యాంటీన్‌లో ఆర్ట్ గ్యాలరీ నిర్మిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయమై వర్సిటీ ఉపాధ్యక్షురాలు కవితా దర్యాణీరావును వివరణ కోరగా అలాంటిదేమి లేదని సమాధానాన్ని దాటవేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

జియాగూడ: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ నగర నాయకులు జి.విఠల్ అన్నారు. బుధవారం కార్వాన్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో జియాగూడ మేకలమండిలో ఆటో డ్రైవర్స్‌కు కరపత్రాలను పంచి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ..16న దేశవ్యాప్త కార్మిక సమ్మె జయప్రదం చేయాలని ఆటో కార్మికులను కోరారు. రైతాంగ కార్మికవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదని ఆయన పేర్కొన్నారు. కమేళాను రక్షించడానికి సీఐటీయూ ఎప్పుడూ ముందుగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ కల్యాణ్, కో కన్వీనర్ చుక్క నర్సింహ, సీఐటీయూ నాయకులు డి.యాదయ్య, కమేళా ఆటో యూనియన్ కార్యదర్శి ఎస్.మల్లేష్, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.


అసంపూర్తిగా ఉన్న బాక్స్ డ్రెయిన్ పనులు

పనులు పూర్తయ్యేదెప్పుడో..?

నత్తనడకన బాక్స్ డ్రెయిన్ పనులు

- మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ మీదుగా ప్రధాన రోడ్డు మూసివేత
- గల్లీ రోడ్లకు ట్రాఫిక్ మళ్లింపు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మణికొండ: అది మణికొండ మున్సిపాలిటీకి వచ్చే ప్రధాన రోడ్డు. అలాంటి రహదారిని నెలన్నర రోజులుగా మూసేసి ట్రాఫిక్ డైవర్షన్ చేయడంతో ప్రజలు, వాహనాదారులు గల్లీ రోడ్ల ద్వారా ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జీహెచ్‌ఎంసీ, ఎస్ఎన్‌డీపీలు రూ.9.80 కోట్ల మున్సిపల్ నిధులతో మణికొండ మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ మీదుగా హైదరాబాద్ నగరానికి వెళ్లే ప్రధాన రహదారిపై బాక్స్ డ్రెయిన్ పనులు ప్రారంభించారు. 20 రోజుల్లో నిర్మాణాలు పూర్తి చేస్తామని గత నెల 5వ తేదీన ట్రాఫిక్ పోలీసుల అనుమతులు తీసుకొని ట్రాఫిక్‌ను గల్లీ రోడ్లకు మళ్లించారు. గత నెల చివరనే పనులు పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. వాహనదారులు తెలిసి తెలియని రోడ్ల ద్వారా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

3 అడుగులు ఎత్తులో డ్రెయిన్..

సాధారణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు భూమి లోపలే వస్తాయి. అలాంటిది లెవల్ కలవలేదనే కారణంతో ప్రధాన రోడ్డుపై మూడు అడుగుల ఎత్తులేపి నిర్మాణం చేపట్టారు. కనీసం బాక్స్ డ్రైన్ పనులు పూర్తయినంత వరకైనా రోడ్డు లెవల్ పనులు ఎందుకు చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయకుండా తాత్సారం చేస్తున్న అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించాలని మణికొండ మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.


ప్రధాన రోడ్డుపై మూడు అడుగుల ఎత్తులో బాక్స్ డ్రెయిన్

రాకపోకలకు తీవ్ర ఇబ్బంది..



బాక్స్ డ్రైన్ పనుల పేరిట ప్రధాన రోడ్డును నెలల తరబడి మూసివేసేందుకు అధికారులు అనుమతించటం తప్పు. దీంతో నిత్యం హైదరాబాద్‌కు, ఓయూ కాలనీకి రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులను నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి. అలాగే నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి

–పి.రవి, మణికొండ

ట్రాఫిక్‌కు అంతరాయం..



మణికొండ ప్రధాన రోడ్డును మూసేసి ట్రాఫిక్‌ను మళ్లించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ మళ్లించే రోడ్లను ముందుగా పరిశీలించి వాటికి అవసరమైన మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఇరుకు, గుంతల రోడ్లలో అనేక మంది కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇకనైనా జీహెచ్‌ఎంసీ అధికారులు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

–డి.సీతారాం, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు

వారం రోజుల్లో స్లాబ్ పనులు పూర్తి ..

మణికొండ ప్రధాన రోడ్డును మూసి బాక్స్ డ్రైన్ పనులు చేపట్టాం. అయితే అనుకున్న సమయంలో పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవం. కింద బెడ్, సైడ్ వాల్స్, పై కప్పులు ఆర్‌సీసీతోనే చేపడుతుండడంతో ఆలస్యం అవుతుంది. వారం రోజుల్లో బాక్స్ డ్రైన్ స్లాబ్, అనంతరం రోడ్డు లెవల్ పనులు చేపట్టి 15 రోజుల్లో పూర్తి చేస్తాం.

–విశాలక్ష్మి, డీఈ, జీహెచ్‌ఎంసీ

సొంతఖర్చులతో శ్మశాన వాటికలో సౌకర్యాలు

ఆరాంఘర్ వైకుంఠధామంలో బోర్‌వెల్ ఏర్పాటు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆరాంఘర్ శ్మశాన వాటికలో కార్వాన్ ప్రాంతానికి చెందిన ఏ మల్లేశ్ సొంత ఖర్చులతో సౌకర్యాలు కల్పించాడు. దహన సంస్కారానికి వచ్చిన మల్లేశ్ అక్కడి పరిస్థితులను చూశాడు. వాటర్ ట్యాంకర్ కింద స్నానాలు చేయడం, కూర్చునేందుకు బల్లాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చలించి పోయిన ఆయన అక్కడి పెద్దలను కలిసి సొంత డబ్బులతో బోర్‌వెల్, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చాడు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానికులతో కలిసి సుమారు రూ. 2 లక్షలు వెచ్చించి బోరువెల్ వేయించాడు. రాజకీయ నాయకులు చేయని పనిని ఓ సాధారణ వ్యక్తి సొంత డబ్బులతో చేపట్టడంపై స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్, కృష్ణాగౌడ్, మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్, రాజు, అంబాదాస్, చిట్టి, కిష్టప్ప ఉన్నారు.


నూర్‌మహమ్మద్ కుంటలో బోరు వేసేందుకు పూజలు చేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీలోని శ్రీ లలితా సమేత కామేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ నెల 12వ తేదీన ప్రారంభం కాగా బుధవారం వరకు వైభవంగా సాగాయి. చివరి రోజు గణపతి పూజ, అష్టోత్తర శత కలశస్నపనం, పరివార దేవతలకు శిఖరములకు మహాకుంభాభిషేకం, చండీహోమం, గణపతి, లక్ష్మీ గణపతి, రుద్ర హోమం, శ్రీ సూక్త పూర్వకంగా మహాలక్ష్మి హవనం, వాస్తు హోమం, మృత్యుంజయ హోమం, మహా పూర్ణాహుతి పూజలు చేశారు. అనంతరం పండిత సత్కారం, వేద ఆశీర్వచనం, ధ్వజ అవరోహణం, అన్న ప్రసాదం, సాయంత్రం స్వామి వారికి గ్రామ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, పంచవటి కాలనీ వాసులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న పంచవటికాలనీ వాసులు

పాఠశాలలో సమస్యలు బోలెడు



చందానగర్‌లోని వేమన వీకర్ సెక్షన్‌లోని ప్రాథమిక పాఠశాల

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు మన బడిలో భాగంగా అభివృద్ధి చేస్తోంది. పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్న నేపథ్యంలో వాటికి తగట్లుగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు కొరకు మన ఊరు మన బడి కార్యక్రమం ప్రారంభించింది. కానీ చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన వీకర్ సెక్షన్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2002లో ప్రారంభమైన పాఠశాల అప్పటి నుంచి నేటి వరకు పాఠశాలకు కావలసిన వసతులు పట్టించుకునే అధికారి, ప్రజాప్రతినిధులు కరువయ్యారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 47 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ ఉపాధ్యాయులు 5 మంది ఉండాల్సిన చోట ఇద్దరు ఉన్నారు. ప్రజాప్రతినిధులకు పాఠశాల సమస్యలపై విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో చందానగర్ వేమన వీకర్ సెక్షన్ ప్రభుత్వ పాఠశాలకు అభివృద్ధిలో చోటు కల్పించి వెంటనే పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమస్యలు ఇవే....

- పాఠశాల చుట్టు ప్రహరీ లేక భయాందోళనలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- రెండు గదులలోనే 1 నుంచి 5 తరగతి విద్యార్థులు ఉంటున్నారు.
- 5 తరగతులు విద్యార్థులు రెండు గదులలోనే కూర్చొని చదువుకోవల్సిన పరిస్థితి నెలకొంది.
- తాగడానికి మంచినీటి ట్యాంక్ లేదు, కేవలం ఒక బిందెలో ఉన్న నీటిని 50 మంది తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా సుమన్‌రావు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు మక్తల్ మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న బి. సుమన్‌రావు ఇక్కడికి బదిలీపై నియమితులయ్యారు.

గండిపేట తహసీల్దార్ బదిలీ

మణికొండ: గండిపేట తహసీల్దార్‌ను రాష్ట్ర ప్రభుత్వం కలెక్టరేట్‌కు బదిలీ చేసింది.ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఎం. శ్రీనివాస్‌రెడ్డిని నియమించింది. గురువారం నూతన తహసీల్దార్ బాధ్యతలు చేపట్టావచ్చని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

రేపు సెలూన్ లాంజ్ ప్రారంభం

రాజేంద్రనగర్: హైదరాబాదీలకు సరికొత్త అనుభూతిని అందించేందుకు అత్తాపూర్‌లో ఏర్పాటు చేసిన విలాసవంతమైన ఎస్సేనుషియా సెలూన్ లాంజ్‌ను ఈ నెల 16న చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు టిలివిజన్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సేనుషియా యజమానురాలు స్వాతిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వర్ధమాన నటుడు సోహేల్, సినీ, టీవీ నటి సునీత తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడేవారికే సముచిత స్థానం

రాజేంద్రనగర్: కాంగ్రెస్‌లో కష్టపడేవారికే పార్టీలో సముచిత స్థానం ఉంటుందని రాజేంద్రనగర్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు పెండ్యాల శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువ నాయకుడు అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు నామినేట్ చేయడమే ఇందుకు నిదర్శమని తెలిపారు. అలాగే రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో 17 స్థానాలు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు

జియాగూడ: ఇమాంపురాలో బొడ్రాయి నాభిశిల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించామని ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. బుధవారం ఇమాంపురా చౌరస్తాలో బొడ్రాయి నాభిశిల వేడుకలను చేపట్టారు. ముందుగా వేద పండితుల పూజా కార్యక్రమం, బొడ్రాయి యంత్ర ప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, వాటర్‌వర్క్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వై.యాదయ్య, డి.సంతోష్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్, మహేష్‌బాబు, జస్వంత్‌కుమార్, శివకుమార్, సి.సత్యనారాయణ, పి.నర్సింగ్‌రావు, ఎస్.జగదీష్, ఎ.గౌతమ్, అర్జున్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న హరీశ్‌గౌడ్


బండ్లగూడ: ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హరీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేటర్లు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని, ప్రధానంగా నీటి సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసి ఇంటర్ లింక్ వాటర్ కనెక్షన్ పనులు పూర్తి చేయాలని కోరామన్నారు. పీఅండ్‌టీ కాలనీలో త్వరలోనే రిజర్వాయర్ పనులు మొదలు పెడతామని, ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాంప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


నార్సింగిలో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మణికొండ: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం అవుతుందని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. కాంతారెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో అధికారులు, సిబ్బందితో కలిసి ట్రాఫిక్ నియమాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణిస్తున్న వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, నో పార్కింగ్ జోన్‌లో నిలపవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సేవాలాల్ మహారాజ్ చిత్రపటం



రాజేంద్రనగర్: సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ అంతర్జాతీయ చిత్ర కళాకారుడు, యూనివర్సిటీ ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్ నాయక్ కాన్వాస్‌పై గీసిన సేవాలాల్ మహారాజ్ చిత్రం విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని చిత్రాన్ని గీసినట్లు తెలిపారు. తాను గీసిన చిత్రానికి స్పందన లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉరేసుకొని హమాలీ ఆత్మహత్య

అత్తాపూర్: ఉరేసుకొని ఓ హమాలీ మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఏఎస్సై మహ్మద్ అర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బాల్కి ప్రాంతానికి చెందిన సంగప్ప కుమారుడు శివ శంకర్ (33) నందిముస్లాయిగూడ మారుతీనగర్‌లో భార్య, పిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. బేగంబజార్‌లో హమాలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యం మత్తులో ఉన్న శివ శంకర్ తన ఫోన్ ఎక్కడో పోయిందని.. అలసటగా ఉందని భోజనం వండాలని భార్య సుజాతకు చెప్పి పడుకున్నాడు. సుజాత తల్లి ఆరోగ్యం బాగాలేకపోవడంతో అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లింది. సమీపంలో ఉంటున్న యువతి పూజ సుజాతకు ఫోన్ చేసి మీ ఇంట్లో చీకటిగా ఉందని చెప్పింది. దీంతో సుజాత ఇంటికి వచ్చేసరికి భర్త ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. ఇంటి యజమాని సహాయంతో శివ శంకర్‌ను కారులో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం ఉదయం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 18న 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'అప్రిషియేటివ్ ఇన్‌క్వైరీ' అనే అంశంపై టర్కీ దేశానికి చెందిన పర్సనల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ యోగేష్‌శ్రద్ధా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

మహిళలకు నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

ఇఫ్లూలో ఒకరోజు వర్క్‌షాప్

రాయదుర్గం: అకడమిక్, జర్నలిస్టిక్ రైటింగ్‌ను ఒకచోట చేర్చే ప్రయత్నం చేస్తున్నామని ఇఫ్లూ యూనివర్శిటీలోని ఫిల్మ్ స్టడీస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ హెచ్ నిఖిల పేర్కొన్నారు. గచ్చిబౌలి లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూనివర్శిటీ ఫిల్మ్ క్లబ్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ఆధ్వర్యంలో ఔట్ రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఫిల్మ్ రివ్యూలు రాయడం'పై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన 40 మందికి పైగా విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఫిలిమ్ క్లబ్ విద్యార్థుల కోసం ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను తీసుకువస్తుందన్నారు. అనంతరం కల్చరల్ యాక్టివిటీ సెంటర్‌లో 9 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్ హెయిర్ కట్ చిత్రాన్ని ప్రదర్శించారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

హఫీజ్‌పేట్ : పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పాపిరెడ్డి నగర్ కూరగాయాల మార్కెట్‌లో జ్యూట్ బ్యాగుల సంచులు వాడుకలోకి తీసుకురావాలని ఆయన పంపిణీ చేశారు.

సర్కిల్–12 డీఎంసీగా నాగేశ్వరరావు

నాంపల్లి: జీహెచ్‌ఎంసీ పరిధిలోని మెహిదీపట్నం సర్కిల్–12 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ (డీఎంసీ) బి.చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. రామగుండం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సీహెచ్.నాగేశ్వరరావు మెహిదీపట్నం సర్కిల్–12కు బదిలీ అయ్యారు. నవంబరులో జరిగిన విధాన సభ ఎన్నికల బదిలీల్లో మెహిదీపట్నం సర్కిల్–12కు ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు డీఎంసీగా పనిచేయలేకపోయారు. అనారోగ్యం కారణంగా సెలవు పెట్టడంతో ఆంజనేయులు స్థానంలో బి.చంద్రశేఖర్ ఇన్‌చార్జి డీఎంసీగా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన మూడు నెలలు కూడా ముగియక ముందే మళ్లీ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో మీర్‌పేటకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో నియమితులైన రామగుండం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.